క్లుప్తంగా

బీఎంఎస్‌లో చేరిక

శ్రీరాంపూర్: నస్పూర్‌లోని సింగరేణి కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్(బీఎంఎస్) కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 20మంది కాంట్రాక్ట్ కార్మికులు ఆ యూనియన్‌లో చేరగా, వారికి బీఎంఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి కండువా కప్పి స్వాగతం పలికారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు రాగం రాజేందర్, గూడ శ్రీకాంత్, బోడకుంట శ్రీధర్, మిట్టపల్లి మొగిలి, రామకృష్ణ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

'రఘునాథ్‌పై విమర్శలు అర్థరహితం'

బెల్లంపల్లి: బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌ను విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్‌నాయకులు రఘునాథ్‌పై నిరాధారమైన విమర్శలు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ముగ్గురు ఉండగా, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు జరిగిన మేలేమీ లేదని ప్రశ్నించిన రఘునాథ్‌పై అర్థరహితమైన ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. వెరబెల్లి ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ప్రజాసేవ, సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న రఘునాథ్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి కాంగ్రెస్ నాయకులు కలవరపడుతున్నారని తెలిపారు. ఆధారాలు లేకుండా చేస్తున్న తప్పుడు విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు.

'హామీల అమలులో విఫలం'

దండేపల్లి: ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలం అయ్యిందని బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య విమర్శించారు. దండేపల్లిలో ఆదివారం పార్టీ కార్యకర్తలతో కలిసి సమావేశం నిర్వహించారు. హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌పై కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారం చేసి, బురద జల్లే ప్రయత్నం చేస్తూ కేసులు పెట్టించడం సరికాదన్నారు.

నేటి నుంచి ప్లంబింగ్ పనులు బంద్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్లంబర్లు

శ్రీరాంపూర్: తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29 నుంచి ఆగస్టు 2 వరకు ప్లంబింగ్ పనులు బంద్ పెడుతున్నట్లు మంచిర్యాల ప్లంబర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పీ.మల్లేశ్ తెలిపారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి ప్లంబర్ మేస్త్రీని టెక్నీషియన్‌గా ప్రభుత్వం గుర్తించాలని, తదితర సమస్యలపై బంద్ పాటిస్తున్నామన్నారు. మంచిర్యాలలోని ప్లంబర్లు ఆగస్టు 2న మంచిర్యాలలోని తమ సంఘం కార్యాలయంలో జరిగే మహాసభకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆట్ల అంజనేయులు, కోశాధికారి తోకల అంజయ్య, ఉప కార్యదర్శి ఎం. వెంకటేశ్వరచారి, సంయుక్త కార్యదర్శి ఎండీ మజీద్‌తో పాటు కనకరాజు, శంకర్ పాల్గొన్నారు.

సీపీఐ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: సీపీఐ పార్టీ సింగపూర్ శ్రీరాంపూర్ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్‌లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన కమిటీ ప్రజల సమస్య కోసం, వాటి పరిష్కారం కోసం పని చేయాలన్నారు. కమిటీ నూతన కార్యదర్శిగా పూజారి రామన్న, సహాయ కార్యదర్శిగా కొత్తపల్లి మహేష్, కోశాధికారిగా సాయికిరణ్‌లను ఎన్నుకున్నారు.

ఆదివాసీ దినోత్సవంపై సమావేశం

దండేపల్లి: మండల కేంద్రంలో ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు వేడుకల నిర్వహణపై సంఘ నాయకులు ఆదివారం దండేపల్లిలో సమావేశం అయ్యారు. వేడుకల నిర్వహణపై చర్చించారు. ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పరిహారం అందజేయాలి

వేమనపల్లి: ఏడు రోజులుగా ఉప్పొంగి ప్రవహించిన ప్రాణహిత నది బ్యాక్ వాటర్‌తో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందజేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ అన్నారు. పెద్ద మొత్తంలో పంటలు కోల్పోయి రైతులు అల్లాడుతుంటే స్థానిక ఎమ్మెల్యే పంటలను పరిశీలించేందుకు, రైతులను ఓదార్చేందుకు రాలేదని విమర్శించారు.

తల్లీ.. సల్లంగ సూడు!

- గ్రామ దేవతలకు బోనాలు
- భక్తిశ్రద్ధలతో పూజలు
- కోళ్లు, మేకలు బలిచ్చి మొక్కులు తీర్చుకున్న భక్తజనం


బెల్లంపల్లి: అంబేద్కర్ రడగంబాల బస్తీలో నల్ల పోచమ్మతల్లికి బోనాలు

బెల్లంపల్లి: ఆషాఢమాసం ఆఖరి ఆదివారం కావడంతో పోచమ్మ బోనాలను నిర్వహించారు. మున్సిపాలిటీలోని 24వార్డు అంబేద్కర్‌రడగంబాల బస్తీలో వార్డు మున్సిపల్ కౌన్సిలర్ దామెర శ్రీనివాస్ బస్తీ పెద్దల ఆధ్వర్యంలో పోచ మ్మ తల్లి, నల్ల పోచమ్మ తల్లి ఆషాఢ బోనాల ఉత్సవాలను ఉత్సాహంగా నిర్వహించారు. పోచమ్మ తల్లి, నల్ల పోచమ్మ తల్లులకు నైవేద్యం సమర్పించి సల్లంగా చూడాలని జంతువులను బలి ఇచ్చి వేడుకలను జరుపుకున్నారు.

కాసిపేట: మండలంలోని ట్యాంక్‌బస్తీ, సోమగూడెం, ఎన్‌టీఆర్ కాలనీలకు చెందిన భక్తులు బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సోమగూడెంలో మాజీ సర్పంచ్ సఫాట్ శంకర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు

మంచిర్యాలఅర్బన్: ఆషాఢమాసం సందర్భంగా పాత మంచిర్యాలలో మడేలయ్య స్వామి ఆలయంలో బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల జాతరలో డీసీసీ అధ్యక్షురాలు సురేఖ నెత్తిన బోనం ఎత్తారు. మహిళలతో కలిసి ర్యాలీ చేపట్టి ఆలయంలో బోనాలు సమర్పించారు. ప్రజలంతా సుఖసంతోషాలు, ఆరోగ్యంగా ఉండాలని మడేలయ స్వామిని కోరినట్లు తెలిపారు. ఏసీసీ శ్రీనివాస కాలనీలో పోచమ్మ బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకుడు శంకర్ ఆధ్వర్యంలో పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు.. రెడ్డికాలనీలో బోనాలతో డప్పుచప్పుళ్లతో వచ్చి పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఎల్ఐసీ కాలనీ ఆదివారం సాయంత్రం పెద్దమ్మతల్లి బోనాల జాతర ఘనంగా ముగిసింది. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన జాతరలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పాల్గొని అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పురిగిరి క్షేత్రియ ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.


ఆలయం వద్ద మహిళలతో సురేఖ


లక్సెట్టిపేట: బోనాలతో భక్తులు


కాసిపేట: బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

గంగమ్మ తల్లికి ఘనంగా పూజలు





పాతమంచిర్యాల: ఆషాఢమాసం బోనాల సందర్భాన్ని పురస్కరించుకొని వాడ బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో మత్స్యకారులు మంచిర్యాల గోదావరి నదీ తీరంలో గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మత్స్యకారులకు గోదావరి నదికి తీరని అనుబంధం ఉందని, చేపల వేటకు వెళ్లే ప్రతీ మత్స్యకారున్ని సల్లంగా దీవించుమని వేడుకున్నారు. అమ్మవారికి తంగేడు చెట్లతో పందిర్లు వేసి పసుపు కుంకుమ, కొబ్బరి కాయలు సమర్పించి సల్లంగా చూడాలని కోరుకున్నారు. కార్యక్రమంలో వాడబలిజ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడెంకి చందు, జిల్లా అధ్యక్షులు బొడెంకి మహేష్, ప్రధాన కార్యదర్శి పిట్టల దశరథం, ఉపాధ్యక్షులు గగ్గూరీ రాజన్న, పట్టణ అధ్యక్షులు బొడెంకి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గంగమ్మతల్లి బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గంగపుత్ర సంఘ భవనం నుంచి డప్పుళ్ల చప్పుళ్ల, డీజే మోతలతో గంగపుత్రుల చేపల వల, చేపల వేట పనిముట్లతో శోభాయాత్రగా గోదారమ్మ నదీ తీరానికి చేరుకున్నారు. గోదారమ్మకు పూజలు జరిపిన అనంతరం పసుపు, కుంకుమలతో మొక్కులు సమర్పించి పూలమాలలతో బోనాలు సమర్పించారు. పిల్లా, పాపలను ప్రతి ఒక్కరినీ సల్లంగా చూడాలని గంగమ్మతల్లిని వేడుకున్నారు. కనుల పండవగా జరిగిన జాతర వేడుకల్లో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు బోరె లింగయ్య, స్థానిక పెద్దలు ధర్మాజీ అర్జయ్య, శెట్టిపల్లి మల్లయ్య, బోరె అంజయ్య, తిరుపతి, గుమ్ముల భీమయ్య, ధర్వాజ రాజేందర్, వెంకటేశ్, రమేశ్, రాజలింగు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మహంకాళి బోనాలు


బోనాలతో గుడికి వెళ్తున్న భక్తులు

మందమర్రిరూరల్: పట్టణంలోని బురుదగూడెం సమీపంలోని మహంకాళీ అమ్మవారి బోనాల జాతర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాత సీఎస్పీ రోడ్డు సమీపంలో గల శ్రీనిలయం నుంచి మహంకాళీ ఆలయ ప్రాంగణంలోని ఏడుగురు అక్కాచెల్లెళ్ల గుడి వద్దకి తీసుకొచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ అ ర్చకులు మంతెన వాణి సతీష్ చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మె ల్యే నల్లాల ఓదెలు, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి బోనాలెత్తగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బోనాల వేడుకలో ఎమ్మెల్యే


మైసమ్మ తల్లికి పూజలు చేస్తున్న వినోద్

బెల్లంపల్లి: హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా ఆదివారం జరిగిన బోనాల వేడుకల్లో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పాల్గొన్నారు. కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయంలో వినోద్ ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి పాత బస్తీలోని లాల్ దర్వాజా ఆలియా బాద్ మేకల బండలో ఉన్న నల్లపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని, పాడి పంటలు సుభిక్షంగా వర్ధిల్లాలని నల్ల పోచమ్మ తల్లిని వినోద్ వేడుకున్నారు.

మైసమ్మ తల్లికి మొక్కులు


ఆలయం వద్ద వాహన యజమానులు

జన్నారం: మండలంలోని కలమడుగులో ఫోర్ వీలర్ వాహన ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోదావరి తీరంలో వెలసిన మైసమ్మ తల్లి ఆలయం వద్ద ఆదివారం మొక్కు తీర్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నీలేశ్, సభ్యులు రాజగౌడ్, బాలరాజు, సతీశ్, లక్ష్మణ్, మల్లేశ్, రాజేశం, రాకేశ్, రాజన్న, అశోక్, నవీన్, రాజేందర్, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మడేలయ్య జాతర


టీకానపల్లిలో భక్తుల మొక్కులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం టీకానపల్లిలో ఆదివారం మడేలయ్య జాతర మహోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిపారు. ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే రజకుల ఆరాధ్య దైవమైన మడేలయ్యస్వామి జాతరలో భాగంగా మడేలయ్య స్వామికి ప్రత్యేక పూజలు జరిపి బోనాలు సమర్పించారు. జాతరలో రజక కులబాంధవులు ఓరగంటి లచ్చయ్య, రాజయ్య, శ్రీనివాస్, తుల్చయ్య, రామ్మోహన్, స్థానికులు పాల్గొన్నారు.

గోరింటాకు సంబురాలు


సంబురాల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో గల పద్మనాయక ఫంక్షన్ హాల్లో ఆదివారం ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని గోరింటాకు సంబురాలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొనగా, మహిళలు గోరింటాకు తయారు చేసి పెట్టుకుని, వేడుకగా సంబరాలను జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

ఉర్సుకు ఎమ్మెల్యే ఆర్థికసాయం


చెక్కు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాండూర్: తాండూర్‌లో నిర్వహించే ఉర్సు ఉత్సవాలకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆర్థిక సాయం అందజేశారు. ఏటా మాదిరిగానే ఈ నెల 31, ఆగస్టు 1న ఉర్సు ఉత్సవాలు జరగనున్నాయి. వేడుకల నిర్వహణ కోసం తనవంతు సాయంగా ఎమ్మెల్యే రూ.25వేల విరాళం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్‌ను కాంగ్రెస్ తాండూర్ మండల అధ్యక్షుడు ఎండి ఈసా, మాజీ ఎంపీటీసీ సిరంగి శంకర్‌కు అందజేశారు. ఈ మేరకు ఆదివారం దర్గా కమిటీ సభ్యులకు సదరు నాయకులు చెక్కును అందించారు. ఆర్థికసాయం చేసిన ఎమ్మెల్యేకు దర్గా కమిటీ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని సింగరేణి చిల్డ్రన్స్ పార్క్‌లో ఆదివారం బీసీ వసతి గృహం విద్యార్థులు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ విస్తారంగా మొక్కలు నాటి కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సమాజ సేవకులు నాదిర్‌షా నక్వీ, గజ్జెల్లి మోహన్ ,విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు నిత్యావసరాలు పంపిణీ

సాక్షి ఎఫెక్ట్..

నెన్నెల: మండలంలోని గంగారాం గ్రామంలోని దుబ్బగూడంకు చెందిన వృద్ధ దంపతులు సల్లూరి వీరమల్లు–లస్మక్క గుడిసె వర్షాలకు కూలిపోయి నిరాశ్రయులయ్యారు. దిక్కు తోచని స్థితిలో బిక్కు బిక్కుమంటూ దాతల సాయం కోసం ఎదురుచూస్తున్న వృద్ధ దంపతుల దీన స్థితిపై 'వర్షాలకు కూలిన గుడిసె' అనే శీర్షికన ఈ నెల 26న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామెర ప్రకాష్ స్పందించి ఆదివారం వారికి రెండు నెలలకు సరిపడా బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. వృద్ధుల దీన స్థితిని ప్రచురించి వారికి ఆర్థిక సాయం అందేలా కృషి చేసిన 'సాక్షి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మల్లేష్, శ్రీనివాస్, రాజం, వీరేష్, కుమారస్వామి పాల్గొన్నారు.


వృద్ధులతో నేతకాని సంఘం నాయకులు

తర'గతి' మారలే


నెన్నెల: అదనపు తరగతి గదులు నిర్మించి విద్యార్థుల ఇబ్బందులు తీర్చడానికి 14ఏళ్ల క్రితం పనులు చేపట్టారు. కానీ అవి ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. నెన్నెల మండలంలోని కోణంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 14ఏళ్ల క్రితం నిర్మించిన అదనపు గదుల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. నాయకులు, అధికారులు స్పందించి నిర్మాణం పూర్తి చేసి అసౌకర్యాల నడుమ అద్దె ఇంట్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ సెంటర్‌ను పాఠశాలలోకి మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'పాఠశాలలు - క్రమశిక్షణ'పై కవితాగానం

మంచిర్యాలఅర్బన్: జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో మంచిర్యాలలో పాఠశాలలు – క్రమశిక్షణ అనేఅంశంపై ఆదివారం నిర్వహించిన కవితాగానం అలరించింది. ప్రస్తుత సమాజంలో క్రమశిక్షణ కొరవడిందని, పెద్దలపట్ల గౌరవం లేకుండా మితిమీరిన స్వేచ్ఛతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని కవులు అభిప్రాయపడ్డారు. క్రమశిక్షణ లేకుండా చదువులెలా అబ్బుతాయో, ఎటువంటి సమాజం మనకు అ వసరమో ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. కవి సమ్మేళనంలో సంతోష్, పలువురు కవులు కవితా గానం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వామన్‌రావు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ జెడ్పీటీసీ ఆర్.సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ సాబీర్‌ఆలీలు రూ.1,94,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గాలి మధు, తిరుపతిరెడ్డి, రామచంద్రం, కుబిడె కిష్టయ్యతో పాటు నాయకులు పూర్ణచంద్రారెడ్డి, రాజన్న, పున్నంలు పాల్గొన్నారు.

6న జంతర్‌మంతర్ వద్ద దీక్ష

చెన్నూర్: ఎస్సీ వర్గీకరణ విషయంలో బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు మాట ఇచ్చి విస్మరించిందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్ మండిపడ్డారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు అమలు కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపించిన కానీ, ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వర్గీకరణ అయ్యేంతవరకు ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా వచ్చే నెల 6న దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ దీక్షను ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలన్నీ భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం దీక్షకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్, మండల అధ్యక్షుడు ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు శ్యామ్, ఎంఎస్‌ఎఫ్ అధ్యక్షుడు శ్రావన్, సాయి. పోచం శ్రీధర్, సందీప్, నవీన్, కమల్ ఉన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ముదిరాజ్ కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి

చెన్నూర్: రాష్ట్ర జనాభాలో 13శాతం ఉన్న ముదిరాజ్ కులస్తులకు ప్రభుత్వం ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.1000కోట్లు కేటాయించాలని ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి సాధనబోయిన కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశంలో ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.50కోట్లు కేటాయించడం నిరాశపర్చిందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కోరారు.

వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం

నెన్నెల: మండల కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన అబ్బర్ల శేఖర్ అనే యువకుడిపై తాగిన మైకంలో తల్లిదండ్రులు విజయ్–పద్మలు కలిసి రెండు రోజుల క్రితం కొడవలితో దాడి చేసి పొట్టపై తీవ్రంగా గాయపర్చారు. చావు బతుకుల్లో ఉన్న శేఖర్‌ను మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. తల్లిదండ్రులు జైలుకు పోవడం, నిరుపేద కుటుంబం కావడంతో చేతిలో చిల్లిగవ్వలేక వైద్యం చేయించలేక దిక్కు తోచని స్థితిలో ఉన్న బాధిత కుటుంబం కోసం పోచమ్మవాడ యువకులు ముందుకు వచ్చి రూ.30వేలు, కోవిడ్ వలంటరీ బృందం వాట్సప్ ద్వారా సేకరించిన రూ.3,500, మొత్తం రూ.33,500ను బాధిత కుటుంబానికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాస్, పోచమ్మవాడ యువకులు మహేశ్, షేర్‌ఖాన్, మొహిబిన్, షాహిద్, ముఖేష్, అమర్, దావుద్‌లు పాల్గొన్నారు.